



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 14: వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వ్యాధులు ప్రబలకముందే క్షేత్రస్థాయిలో అన్ని చోట్ల ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, పచ్చదనం పరిశుభ్రత అంశాలపై సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి సీఎస్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, విషజ్వరాల పరిస్థితిపై ఆరా తీశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3698 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయని వేగంగా విస్తరిస్తునందున ఈ వ్యాధి నివారణకు క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన పచ్చదనం స్వచ్ఛదనం కార్యక్రమం ఎంతో సత్ఫలితాలను అందించిందని సీఎస్ అన్నారు. దీన్ని నిరంతరం కొనసాగించి పల్లెల్లు, పట్టణాల్లో పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగుపరిచేలా పచ్చదనాన్ని పెంపొందించేలా చొరవ చూపాలన్నారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీపీవో తరుణ్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

వేడుకలకు సిద్ధమైన పరేడ్‌గ్రౌండ్

సిద్ధమవుతున్న శకటాలు

స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు


- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- ఉదయం 10 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరించనున్న రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. గురువారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్‌ను వేడుకలకు సిద్ధం చేశారు. గురువారం ఉదయం 10గంటలకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు పోలీసు పరేడ్ మైదానంలో వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. అతిథుల కోసం ప్రత్యేకంగా షామియానాలు ఏర్పాట్లు చేశారు. ప్రజల కోసం ప్రత్యేకంగా టెంట్లు వేశారు. జిల్లా ప్రగతిని ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వివిధ శాఖలకు సంబంధించిన శకటాలను సిద్ధం చేశారు. వర్షం వస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాటర్ ప్రూఫ్ టెంట్‌లను ఏర్పాటు చేశారు. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఇతర అధికారులు బుధవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాలుగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేశారు. ముఖ్య అతిథి ప్రసంగంతో పాటు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. స్వాతంత్ర్య సమర యోధులను సన్మానించడంతో పాటు ఇతర కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎర్రకోట స్వాతంత్ర్య వేడుకలకు జిల్లా విద్యార్థినికి ఆహ్వానం..



నవీపేట : న్యూ ఢిల్లీలో గురువారం నిర్వహించనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి మండలంలోని బినోల జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న కె.భవానికి ఆహ్వానం అందిందని పాఠశాల హెచ్ఎం మోహన్ రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రేరణ అనే కార్యక్రమానికి ఎంపికై గుజరాత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యనభ్యసించిన పాఠశాలలో పది రోజుల పాటు ఆమె ప్రత్యేక శిక్షణ పొందిందని ఆయన తెలిపారు. వేడుకలకు ఎంపికైన భవానిని విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశం గౌడ్, డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, డీఈవో దుర్గాప్రసాద్ అభినందించారు.





మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్


మొదలైన ఉద్యోగుల బదిలీలు

నగర పాలక సంస్థలో కొంత మంది ఉద్యోగులపై ఆరోపణలు రావడంతో కమిషనర్ ఉద్యోగుల బదిలీలకు ఉపక్రమించారు. మొదట శానిటేషన్ ఉద్యోగులను బదిలీ చేశారు. నాల్గవ సర్కిల్‌లో పనిచేస్తున్న ప్రశాంత్ హెల్త్ అసిస్టెంట్‌ను ఒకటవ సర్కిల్‌కు, నాల్గవ సర్కిల్-ఏలో పనిచేస్తున్న సునీల్‌కుమార్‌ను రెండవ సర్కిల్‌కు, ఐదవ సర్కిల్‌లో పనిచేస్తున్న మహిపాల్‌ను మూడో సర్కిల్‌కు బదిలీ చేశారు. శానిటరి ఇన్స్‌పెక్టర్ మహేష్‌కుమార్‌ను నాల్గవ సర్కిల్-ఏకు బదిలీ చేశారు. ఈ విభాగంతో పాటు శానిటేషన్ స్టోర్‌కు ఇన్‌చార్జిగా కూడా నియమించారు. మినీ ట్యాంక్‌బండ్ ఇన్‌చార్జిగా ఉన్న శానిటరి ఇన్స్‌పెక్టర్ మహ్మద్ షాదుల్లా హుస్సేన్‌ను నాల్గవ సర్కిల్-బీకి మార్చారు. మూడవ సర్కిల్‌లో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ శ్రీకాంత్‌ను ఐదో సర్కిల్‌కు మార్చారు. ఒకటవ సర్కిల్‌లో పనిచేస్తున్న వర్క్ ఇన్స్‌పెక్టర్ ప్రభుదాస్‌ను డంపింగ్‌యార్డుకు మార్చారు. రెండో సర్కిల్‌లో పనిచేస్తున్న ఎంపీహెచ్ఎస్ నటరాజ్‌గౌడ్‌ను మినీ ట్యాంక్‌బండ్, వైకుంఠధామాలకు ఇన్‌చార్జిగా నియమించారు. డంపింగ్ యార్డు ఎంపీహెచ్ఎస్‌గా ఉన్న సాల్మన్‌రాజ్‌ను వెహికిల్ యార్డుకు మార్చారు. వీరు వెంటనే తమకు కేటాయించిన సర్కిల్‌లో చేరాలని కమిషనర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రతిరోజూ అందుబాటులో ఉంటా..

- నగర మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్

సుభాష్‌నగర్: నగర పాలక సంస్థలో ప్రజలకు పనిదినాల్లో ప్రతిరోజూ అందుబాటులో ఉంటానని, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తనకు నేరుగా ఫిర్యాదులు అందజేయవచ్చని నగర మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ తెలిపారు. కమిషనర్ అందుబాటులో లేకుంటే కార్యాలయ మేనేజర్ కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. దరఖాస్తులను నేరుగా పౌరసేవ కేంద్రంలో సమర్పించవచ్చని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరిస్తామన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ పర్మిషన్, ఇతర సేవలు టీఎస్‌బీపాస్ అనే ఆన్‌లైన్ విధానంలో అందించబడునని అన్నారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఇతర సిబ్బంది సంస్థ సేవల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే 14420 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. అంతేకాకుండా 08462-221001 లేదా కమిషనర్ వాట్సాప్ నంబర్ 7815957047 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.



సింహాచలం సస్పెన్షన్

- గతంలో జిల్లా సహకార శాఖ అధికారిగా పనిచేసిన సింహాచలం
- కమీషన్ల చెల్లింపులో అవకతవకలపై ఆరోపణలు

నిజామాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గతంలో సహకార అధికారిగా పనిచేసిన కె.సింహాచలంను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు సహకార శాఖ డైరెక్టర్ కమ్ రిజిస్ట్రార్ పి.ఉదయ్‌కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన జిల్లాలో పనిచేసిన కాలంలో సహకార శాఖ పరిధిలో జరిగిన ఆయా పనుల ఆధారంగా ఈ సస్పెన్షన్‌ను విధించినట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆయన తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు సమాచారం ఇచ్చి మాత్రమే హెడ్‌క్వార్టర్ దాటి వెళ్లాలని కోరారు.

కమీషన్ల చెల్లింపులో అవకతవకలపై ఫిర్యాదు..

జిల్లా సహకార శాఖ అధికారిగా 2018 నుంచి 2024 వరకు కె.సింహాచలం పనిచేశారు. ఆయన సమయంలో నిధుల నిర్వహణ, సహకార శాఖ నిర్వహణ, సహకార సంఘాలకు కమీషన్‌ల చెల్లింపులో అవకతవకలు జరిగాయని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ ఎస్.అన్వేష్‌రెడ్డి, జీఎఫ్‌ఏ తెలంగాణ అధ్యక్షుడు కె.సోమశేఖర్‌రావు చేసిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఆ శాఖ జాయింట్ రిజిస్ట్రార్ జె.ప్రసన్న ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెన్షన్‌ను విధించినట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఆమె ఇచ్చిన ప్రాథమిక నివేదిక ప్రకారం సహకార శాఖకు సంబంధించిన నిధుల వినియోగానికి సంబంధించి సక్రమంగా రికార్డులు నిర్వహించకపోవడం, ధాన్యం కొనుగోలు కమీషన్‌కు సంబంధించి ఓచర్లు, చెక్కులు గానీ మెయింటేన్ చేయకపోవడం, అనుమతులు లేకుండా నిధులు మళ్లించడం వంటి కారణాలతో ఈ సస్పెన్షన్ విధించినట్లు పేర్కొన్నారు. ఇవే కాకుండా ఎన్నికలకు సంబంధించి నిధుల వినియోగంలో కూడా సక్రమంగా చేయకపోవడం వంటి కారణాలతో ఈ చర్యలను తీసుకున్నారు. సహకార శాఖ చట్టం ప్రకారం రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆయన ప్రస్తుతం ఆదిలాబాద్ డీసీసీబీలో ఓఎస్‌డీగా పనిచేస్తున్నారు.

నగర పాలక సంస్థలో ప్రక్షాళన షురూ!

- పలు విభాగాలపై దృష్టి సారించిన మున్సిపల్ కమిషనర్
- శానిటేషన్ విభాగంలో పలువురు ఉద్యోగుల బదిలీలు
- రెవెన్యూ, ఇతర విభాగాల్లో కొనసాగుతున్న కసరత్తు
- ఒకటి రెండు రోజుల్లో మరికొంత మంది ఉద్యోగుల బదిలీలు
- ఆదాయానికి మించి ఆస్తుల కేసులో లోతుగా ఏసీబీ దర్యాప్తు

నిజామాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ నగర పాలక సంస్థపై ఏసీబీ తనిఖీల ప్రభావం పడింది. నగర పాలక సంస్థలో కొంత మంది ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు రావడంతో మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ ప్రక్షాళన మొదలు పెట్టారు. ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం చుట్టారు. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులను ఇతర డివిజన్‌లలోని వివిధ విభాగాలకు కేటాయించారు. అలాగే విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేటు వేశారు. పన్నుల వసూలు విభాగంతో పాటు ఇతర విభాగాల్లోనూ బదిలీలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అనుభవం లేనివారిని రెవెన్యూ విభాగానికి మళ్లించి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఏళ్లతరబడి ఒకేపోస్టులో పాతుకుపోయి పలు ఆరోపణలకు కారణమవుతున్న ఉద్యోగులను గుర్తించడంతో పాటు వారిని బదిలీ చేసేందుకు నగర పాలక సంస్థ కమిషనర్ కసరత్తు చేస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ దాడులు సంచలనం

నగర పాలక సంస్థ సూపరింటెండెంట్, రెవెన్యూ ఇన్‌చార్జి నరేందర్ ఇంటిపై ఏసీబీ అధికారుల దాడులు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో పాటు నగరపాలక సంస్థలో జరుగుతున్న అవినీతి ఒకేసారి వెలుగులోకి వచ్చింది. ఒక సాధారణ ఉద్యోగి వద్ద కోట్ల రూపాయల నగదు, విలువైన ఆస్తి పత్రాలు బయటపడటం ఆ శాఖ అధికారులను నివ్వెర పరిచింది. నగర పాలక సంస్థ ఉద్యోగుల్లోనూ చర్చనీయాంశంగా మారింది. కొంత మంది ఉద్యోగులు ప్రజాప్రతినిధుల సహకారంతో ఏళ్లతరబడి ఒకేచోట పనిచేయడం ప్రతి పనికి డబ్బులు తీసుకోవడం, అధికారంలో ఎవరు ఉన్నా వారి సహకారం తీసుకొని ఏళ్లతరబడి కొనసాగుతున్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని శానిటేషన్, రెవెన్యూ విభాగం, టౌన్‌ప్లానింగ్‌తో పాటు ఇతర విభాగాల్లో దీర్ఘకాలికంగా పాతుకుపోయారు. దీంతో ఉద్యోగులందరినీ ఇతర విభాగాలకు బదిలీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీలు చేపట్టగా ఇతర విభాగాల్లోని వారిని కూడా బదిలీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

ఇద్దరు ఉద్యోగుల తొలగింపు

నగర పాలక సంస్థ పరిధిలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో కంఠేశ్వర్ జోన్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండటం మద్యం తాగి విధులు నిర్వర్తించడం వల్ల వారిని తొలగించారు. నగర పాలక సంస్థ పరిధిలోని ఇతర విభాగాల్లోనూ ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతున్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య, ఆరోగ్య విభాగాల్లో బదిలీలు పూర్తి చేయగా రెవెన్యూ, ఇతర విభాగాల్లో దశల వారీగా చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆయా విభాగాల పరిధిలో ఆరోపణలు వచ్చిన వారిని బదిలీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో పై అధికారులు బదిలీ అయినా సూపర్‌వైజర్, ఇతర క్యాడర్‌లో పనిచేస్తున్న వారిని కూడా ఇతర సర్కిళ్లకు మార్చేందుకు సిద్ధమవుతున్నారు. నగర పాలక సంస్థ పలు విభాగాల్లో పనిచేస్తున్న కొంత మంది ఉద్యోగులపై ఆరోపణలు రావడంతో గతంలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా తరలించేందుకు సిద్ధమవుతున్నారు.

మరింత లోతుగా ఏసీబీ అధికారుల దర్యాప్తు

నగర పాలకసంస్థ సూపరింటెండెంట్ నరేందర్‌ను ఆదాయానికి మించి ఆస్తులున్న కేసులో అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. పలువురు ప్రజాప్రతినిధుల ప్రమేయంతోనే నరేందర్ ఎక్కువ రోజులు పనిచేసినట్లు అధికారులు గుర్తించారు. ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఏసీబీ అధికారుల దాడులతో నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

పార్కు స్థలం ఆక్రమిస్తే కేసులు తప్పవు

- ఎంపీడీవో తారచంద్ హెచ్చరిక
- 'ఆంధ్యజ్యోతి' కథనానికి స్పందించి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించిన అధికారులు



పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారులు

సిరికొండ, ఆగస్టు 14: మండలంలోని మెట్టుమర్రి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనం (విలేజ్ పార్కు) స్థలం ఎట్టి పరిస్థితిలో ఆక్రమణకు గురికాకుండా చూస్తామని ఎంపీడీవో తారచంద్ తెలిపారు. ఆక్రమణకు యత్నిస్తే పోలీసు కేసు పెడుతామని ఎంపీడీవో హెచ్చరించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ప్రకృతి వనం స్థలం కబ్జా!'అనే కథనానికి అధికారులు స్పందించారు. అటవీ, పంచాయతీ, మండల అధికారులు బుధవారం ప్రకృతి వనం స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణకు గురైన స్థలం చుట్టూ ట్రెంచ్ కటింగ్ చేసి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. పార్కు స్థలంలో మొక్కలను తొలగించిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమిత స్థలాన్ని పరిశీలించిన వారిలో ఎన్ఆర్ఈజీఎస్ టీఏ నవీన్, పంచాయతీ కార్యదర్శి నిఖిత, ఫారెస్టు సెక్షన్ అధికారి భాస్కర్, బీట్ అధికారులు ప్రవీణ్, వంశీ, రాములు ఉన్నారు.



ప్రకృతి వనం స్థలం కబ్జా!

బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

డైట్ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 14: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా బోధించేందుకు వివిధ సబ్జెక్ట్‌లలో ఎంఏ/ఎమ్మెస్సీ/ఎంఈడీ లేదా ఎంపీఈడీ లేదా ఎంఎఫ్ఏ/బీఎఫ్ఏ అర్హతగల నూతన, రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. దరఖాస్తులను ఈనెల 21లోగా సమర్పించాలని అభ్యర్థుల ఎంపిక మెరిట్, ఇంటర్వ్యూ, డెమో ఆధారంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎంపిక చేయబడిన అతిథి అధ్యాపకులు అకాడమిక్ సంవత్సరం చివరి పనిదినం వరకు ఉంటుందని నెలకు రూ.23,400లు, వ్యాయామ విద్య, కళా విద్య పోస్టులకు రూ.15,600లు గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియాలలో ఫిలాసఫి/సోషియాలజీ, గణిత శాస్త్ర బోధన పద్ధతులు, సాంఘిక శాస్త్ర బోధన పద్ధతులు వ్యాయామ విద్య, కళా విద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఉర్దూ మీడియంలో ఫిలాసఫి/సోషియాలజీ, సామాన్య శాస్త్ర బోధన పద్ధతులు, సాంఘిక శాస్త్ర బోధన పద్ధతులు, ఉర్దూ బోధన పద్ధతుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని సంబంధిత సబ్జెక్టులలో పీజీ, ఎంఈడీ, ఎంపీఈడీ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నర్సింగ్ విద్యార్థినుల వసతుల సౌకర్యాల కోసం ప్రతిపాదనలు

● ఇచ్చిన మాటనే వెంటనే అమల్లోకి తేవడం ఎమ్మెల్యేకే సాధ్యం : టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్



నర్సింగ్ స్కూల్ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బోధన్‌రూరల్,ఆగస్టు14: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మంగళవారం బోధన్ ఆసుపత్రిని సందర్శించి నర్సింగ్ వసతి గృహన్ని పరిశీలించి అదనపు గదులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఇచ్చి మాట నిలబెట్టుకోవడంలో ఆయనకు ఆయనే నిదర్శనమని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నర్సింగ్ విద్యార్థినుల వసతి గృహన్ని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పరిశీలించారు. విద్యార్థినులకు అదనపు గదుల సౌకర్యాల కోసం యుద్ద ప్రాతిపదికన పంచాయతీ రాజ్ అధికారులు చర్యలు చేపట్టి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వసతిగృహం పైభాగంలో షెడ్ ద్వారా గదులను ఏర్పాటు చేసి విద్యార్థినులకు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే హయంలోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం నర్సింగ్ స్కూల్ ప్రారంభమైందని నేడు వసతి గృహం కోసం అదనపు గదులు కూడా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హయంలోనే ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డయాలసిస్ పేషెంట్లు ఆసుపత్రిలోని పై అంతస్తులకు వెళ్లడం వైద్యం చేయించుకోవడం ఇబ్బందిగా ఉందని డయాలసిస్ కేంద్రాన్ని ఖాళీగా ఉన్న ఆర్ఎంవో క్వాటర్స్‌లోకి మార్చాలని దానికి సైతం చర్యలు చేపడుతున్నామన్నారు. వర్షాలకు పాత భవనాల నుండి వర్షపు నీరు ఉరువకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరిండెంట్ డాక్టర్ సుమంత్, పంచాయతీ రాజ్ శాఖ జిల్లా అధికారి రాజయ్య, ఏఈ లిఖిత, తహసీల్దార్ విఠల్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్, సంబంధిత శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

పడిగెలలో శుక్రవారందేవి విగ్రహా ప్రతిష్ఠాపన

వేల్పూర్,ఆగస్టు14: వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో నూతనంగా నిర్మించిన శుక్రవారందేవి ఆలయంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురు వారం దేవి విగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగా వైభవంగా నిర్వ హించారు. అంతకు ముందు బ్రహ్మణ వేద పండితులు మంత్రోచ్చరణాల మధ్య యజ్ఞం, పూర్ణహుతి, విగ్రహ ప్రతిష్ఠాపన వంటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పడిగెల గ్రామంతో పాటు చుట్టు పక్కల గారమాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి శుక్రవారం దేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బోధన్‌లో హర్ ఘర్ 'తిరంగా' ర్యాలీ



బోధన్‌లో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు14: బోధన్ పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ 'తిరంగా' ర్యాలీ నిర్వహించారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన 'తిరంగా' ర్యాలీ పట్టణంలోని పాత బస్టాండ్, పోస్టాఫీస్, శక్కర్‌నగర్ చౌరస్తా ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి ప్రజలు దేశభక్తిని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కూరేళ్ల శ్రీధర్, బీజేవైఎం యోగేష్, పట్టణ అధ్యక్షులు బాలరాజు, శివసేన అధ్యక్షుడు పసులోటి గోపికిషన్, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్న, బీజేపీ నాయకులు అరవింద్, వాసు, సందీప్, వెంకటేష్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● మోస్రాలో..

మోస్రా గ్రామంలో హర్ ఘర్ 'తిరంగా' యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అభిలాష్ గౌడ్, సహ ఇన్‌చార్జి సాయిలు, తాజా మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, మండల ఉప అధ్యక్షుడు లింగం, కార్యదర్శి హన్మా గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు లతీఫ్ ఖాన్, బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాలీబాల్ పోటీలు

మోపాల్, ఆగస్టు 14: పంద్రాగస్టు సందర్భంగా మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు పంద్రాగస్టు రోజున బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.మండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్, ముదక్‌పల్లి, మంచిప్ప, బాడ్సి, మో పాల్, కంజర్‌లో నిర్వహించారు.

హిందు ధర్మరక్షణకు కృషి చేయాలి

● నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్



బోధన్‌లో మాట్లాడుతున్న నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్

బోధన్‌రూరల్,ఆగస్టు14: హిందు ధర్మరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, ప్రతి ఇంట్లో శివాజీని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. బుధవారం సాయంత్రం బోధన్ పట్టణంలోని మారుతి మందిరం వద్ద హనుమాన్ వ్యాయమ శాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేశారు. విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ బోధన్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం, సీట్ల కోసం కనిపించే రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీజాబాయి శివాజీకి కడుపులో ఉన్నప్పుడే వీరగాథలు చెప్పి హిందు ధర్మ రక్షకుడిగా తయారు చేసిందని, అలాగే భారతదేశంలో ప్రతి ఇంట్లో శివాజీలాంటి వ్యక్తిని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హిందువులు ఐక్యమత్యంతో ఉండాలని, ఎటువంటి పరిస్థితి వచ్చిన ఒక్క అడుగు వెనక్కి వేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, హరికృష్ణ రెడ్డి, కోటేశ్వర్‌రావు, విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు14: పట్టణంలోని అక్రమ వసూలు చేస్తున్న శ్రీచై తన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌వీఎస్ విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్ట ణంలోని శ్రీచైతన్య పాఠశాల ముందు నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య ఒలింపియాడ్ టెస్ట్ ముసుగుతో విద్యార్థుల నుంచి రూ.300అదనంగా వసూలు చేస్తున్నారని, అలాగే సెక్షన్ పేరు మీద అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు.ఈ కార్యక్ర మంలో మండల నాయకులు టీఎస్‌వీఎస్ మండల నాయకులు సాయి, కిశోర్, దిలీప్, వికాస్, విగ్నేష్, చరణ్, సిద్దు, పాల్గొన్నారు.

విద్యార్థులపై కుక్కల దాడి

బోధన్‌రూరల్,ఆగస్టు14: బోధన్ పట్టణంలోని శర్బత్ కెనాల్ లయోల పాఠశాల ఎదురుగా గల వీధిలో బుధవారం విద్యార్థులపై కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఉస్మాన్ వలియొద్దీన్, ఉబర్ సలవుద్దీన్ అనే విద్యార్థులు పాఠశాలకు వెళ్తుండగా వెనుక నుండి ఒక్కసారిగా వీధి కుక్కలు దాడులు చేశారని కాలనీ వాసులు బ్యాంక్ బషీర్, తదితరులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

● పట్టపగలే లక్ష్యంగా తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
● నాలుగు తులాల బంగారం రికవరీ



బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి

ముప్కాల్, ఆగస్టు14: బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో జరిగిన అంతరాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్టు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు. బుధవారం బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై యాసిర్‌అర్ఫాత్ వివరాలు వెల్లడించారు. గత నెల 19న చిట్టాపూర్ గ్రామంలో పుంచెట్టి లింగన్న రోజు లాగానే తన ఇంటికి తళం వేసి వ్యవసాయ పనులకు వెళ్ళాడు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి కనిపించడంతో కంగారు తిన్న ఆయన ఇంట్లోకి వెళ్ళి చూడగా బెడ్‌రూంలో సామాన్లు చెల్లచెదురుగా పడి ఉన్నాయి. బీరువలోని ఎనిమిది తులాల బంగారం, నగదు, బాధితుడు బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు, క్లూస్‌టీం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బుధవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు నాందేడ్ జిల్లాకు చెందిన ముస్కర్ నామ్‌దేవ్, మహదేవ్ అలియాస్ శివ ఆర్మూర్ బస్టాండ్‌లో అనుమానస్పదంగా కనిపించడంతో ఎస్సై సిబ్బందితో కలిసి వారిని విచారించగా చిట్టాపూర్‌లో చేసిన చోరీ గురించి వివరించారు. నిందితుల నుంచి ఆరు తులాల బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. మిగతా రెండు తులాలు మనపురం గోల్డ్‌లోన్‌లో ఫిక్స్ డిపాజిట్ చేసినట్టు నిందితులు ఒప్పుకున్నారు. డిపాజిట్ చేసిన బంగారాన్ని లీగల్ విడిపించే ప్రయత్నం చేస్తున్నామని సీఐ వెల్లడించారు. నిందితుడిపై ఇదీ వరకే పలు పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయని, జైలు నుంచి వచ్చిన రెండు రోజులకే చిట్టాపూర్‌లో చోరీకి పాల్పడినట్టు పేర్కొన్నారు. తాళం వేసిన ఇళ్ళలో పట్టపగలే లక్ష్యంగా చోరీకి పాల్పడుతున్నామని వారు తెలిపారు. నిందితుడితో పాటు చోరీకి సహకరించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఊరికి వెళ్లే ముందు తమ విలువైన వస్తులను బ్యాంకులో గాని, వెంట తీసుకువెళ్లాలని పోలీసులకు, చుట్టు పక్కల వారికి సమాచారం అందిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై శంకర్, హెడ్‌కానిస్టేబుల్ విఠల్, రే వంత్, కానిస్టేబుళ్ల లింగన్న, ప్రశాంత్, నరేష్, పవన్, తదితరులు ఉన్నారు.

జీజీహెచ్‌లో జూడాల ఆందోళన



నిరసన తెలుపుతున్న జూడాలు

పెద్దబజార్, ఆగస్టు 14: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో కలకత్తాలోని ఆర్‌జికర్ మెడికల్ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేట్ డాక్టర్‌పై ఇటీవల జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల జిల్లా అధ్యక్షుడు జితిన్ మాట్లాడుతూ కలకత్తాలోని ఆర్‌జికర్ మెడికల్ కళాశాల క్యాంపస్‌లో రెండవ సంవత్సరం పీజీ విద్యార్థిని దారుణంగా చంపడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్లు అనుమానించబడిన ఈ క్రూరమైన నేరం వైద్య సంస్థలు ఆసుపత్రులలో తీవ్రమైన భద్రత సమస్యలను ఎత్తి చూపుతుందని ఎద్దేవా చేశారు. తమ డిమాండ్ నెరవేరే వరకు న్యాయం జరిగే వరకు సమ్మె విరమించబోమని జుడాలు తెలిపారు. నో సేఫ్టీ, నోడ్యూటీ అంటూ ప్లకార్డులను చేతబట్టి నిరసన తెలియజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అడ్వైజర్ ప్రణయ్, రాష్ట్ర వైస్‌ప్రసిడెంట్ రమ్య, గ్రీష్మ, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ మృతుడి తల్లికి ఆర్థిక సహాయం

సిరికొండ ఆగస్టు 14 : ప్రమాదవశాత్తు గల్ఫ్ దేశంలో మరణించిన గడ్కోల్ గ్రామ యువకుడు సందీప్‌గౌడ్ తల్లికి అదే గ్రామానికి చెందిన గల్ఫ్ యూనియన్ పేరుతో పనిచేస్తున్న సంఘ సభ్యులు రూ.40వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. 1998 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు సందీప్‌గౌడ్ కుటుంబ సభ్యులకు రూ.35వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నక్క రాజేశ్వర్,సుదర్శన్‌గౌడ్,రమేష్‌రెడ్డి,గంగాదర్,రఫిక్,వినోద్,రాజు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో యువకుడి ఆత్మహత్య

మోర్తాడ్, ఆగస్టు14: మోర్తాడ్ మండల కేంద్రానికి బోగ సాయికుమార్ (25) వరదకాలువలో పడి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మృతుడు సాయికుమార్ ఇంటి నుంచి బయలుదేరి మోర్తాడ్ శివారులోని పాలెం బ్రిడ్జి గాండ్లపేట్ శివారులో గల వరదకాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కుటుంబసభ్యుల వల్ల మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. బుధవారం శవాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు పంపి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ధర్పల్లి ఎస్‌హెచ్‌వోగా రామకృష్ణ

ధర్పల్లి, ఆగస్టు14: ధర్పల్లి స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా ఎ.రామకృష్ణ బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన విక్రం బదిలీ కావ డంతో ఎస్‌హెచ్‌వోగా రామకృష్ణ బాధ్యతలను చేపట్టా రు. మండలంలో శాంతి భద్రతల కోసం మండల ప్రజలు సహకరిం చాలన్నారు.ఫ్రెండ్లీ పోలీస్‌యే లక్ష్యంగా ముందుకు వెళ్తామని చెప్పారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి జిల్లా క్రీడాకారులు

● జిల్లా జట్టులో భారతీయ జట్టు క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య

సుభాష్‌నగర్, ఆగస్టు 14: పదోరాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నీకీ జిల్లా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఫారుఖ్ అలీ,జావీద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 16 నుంచి ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్,ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణలు హాజరుకానున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారు లు ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. నిజామాబాద్ జిల్లా జట్టులో భారత్ జట్టు క్రీడాకారిణి సౌమ్య పాల్గొననున్నారని తెలిపారు. జిల్లా జట్టుకు చీఫ్ కోచ్‌గా వక్తపాల్, మేనేజర్‌గా అజ్మత్‌ఖాన్, అసిస్టెంట్ కోచ్‌గా ఒట్టిపాటి నాగరాజులు వ్యవహరించనున్నారు.

● ఎంపికైన క్రీడాకారులు వీరే...

రోనిషా, అశ్విని, నక్షత్ర, రష్మిక, మధుశ్రీ, విజయలక్ష్మి, గుగులోత్ సౌమ్య, సహస్ర, మోక్ష తపస్వి, సాయిసమీక్ష, ప్రజ్ఞ, సింధూర, శ్రీష్మ, సుశాంతిక, హరిణి యాదవ్,జాహ్నవి యాదవ్,లహరి,దీపిక చౌదరి,నిశిత,మాధవి,సంజన, రిశ్విక, జరీన్, మనస్విని, నిర్వి, సయుదా,సలేహా,ఫాతిమాలు ఎంపికయ్యారు.

గోపంగిలను ఎస్సీ(సి) లో చేర్చాలి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 14: సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పులో భాగంగా గోసంగి కులాలవారిని ఎస్సీ-సీ లేదా ఎస్సీ-బీలో చేర్చాలని కోరుతూ..జిల్లా గోపంగి సంగం అధ్యక్షుడు ఈర్నాల వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల గోసంగిసంఘాల సభ్యులు బుధవారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ.. గోసంగి సంఘాల సభ్యుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తెచ్చి సమస్యపరిస్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రముఖులు జిల్లా ఉపాధ్యక్షుడు సదుల శ్రీనివాస్,జిల్లా సలహాదారులు ఈర్నాల లింగయ్య, కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు ఊరనర్సయ్య, గందం శ్రీనివాస్, ప్రశాంత్, ఈర్నాల గంగాధర్, గడ్డం లక్ష్మన్ ఉన్నారు.

జాతీయ పతాకాల వితరణ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు14: పట్టణంలోని గోల్‌బంగ్లా, కమలానెహ్రూకాలనీ, హుస్నాబాద్‌గల్లీలో ఇంటింటికి జాతీయ పతాకాలను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ మాట్లాడుతూ హర్‌ఘర్ తిరంగలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతీ ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలని అన్నారు. స్వాతంత్ర సంబురాన్ని, దేశభక్తిని చాటుకుందామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కార్యదర్శి ఎంజె.రమేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి దూకి యువతి ఆత్మహత్య

రెంజల్,ఆగస్టు14: మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో దూకి యువతి ఆత్మహత్య చేసుకుందని స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోధన్ గ్రామానికి చెందిన యువతి కందకుర్తి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు చూసి జాలర్లకు సమాచారం అందించడంతో జాలర్లు వచ్చి యువతి మృతదేహన్ని ఒడ్డుకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు.

నాగన్‌పల్లి బ్రిడ్జి వద్ద గుంతల పూడ్చివేత

బోధన్‌రూరల్,ఆగస్టు14: బోదన్, నాగన్‌పల్లి ప్రధాన రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడడంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గుంతలను పూడ్చివేయించారని సాలూర కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మందర్నా రవి అన్నారు. బుధవారం నాగన్‌పల్లి బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎమ్మెల్యే వెంట వెంటనే చర్యలు తీసుకుంటున్నారని మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లె రమేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రావు, గ్రామస్థులు తదితరులున్నారు.

ఇసుక వేలం పాట వాయిదా

కోటగిరి,ఆగస్టు14: పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఇసుక వేలంపాట నిర్వహించారు. మండలంలోని కొడిచర్ల గ్రామంలో 25 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఆర్ఐ సాయిలు ఆధ్వర్యంలో ఇసుక వేలంపాట నిర్వహించగా ఆరుగురు హాజరయ్యారు. వేలంలో పాల్గొనే వారు సిండికేట్ కావడంతో 5వేలకు మించి వేలం రాకుండాపోయింది. రెవెన్యూ అధికారులు రూ.30వేల వరకు వేలం వస్తుందని ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఇసుక వేలంపాటను వాయిదా వేశారు.

నవీపేటలో కొవ్వొత్తుల ర్యాలీ

నవీపేట,ఆగస్టు14: మండల కేంద్రంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బీజేపీ, బీజేవైఎం, ఆర్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దాడులలో మృతి చెందిన వారికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలి

రుద్రూరు, ఆగస్టు 14 : పర్యావర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, విధి ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలని రుద్రూరు ఎస్ఐ అప్పారావు పేర్కొన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో బుధవారం ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాల,లయన్స్ క్లబ్, దాత్రిశ్రీ ఆధ్వ ర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళా శాల అధ్యాపకులు కళాశాల విద్యార్థులు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పొతంగల్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

కోటగిరి,ఆగస్టు14: పొతంగల్ మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను బుధవారం విండో అధ్యక్షులు శాంతేశ్వర్ పటేల్ ప్రారంభించారు. నాబార్డు నిధులు సుమారు 60లక్షల వ్యయంతో 15షెట్టర్లు నిర్మించినట్లు విండో అధ్యక్షులు తెలిపారు. త్వరలోనే షాప్‌లను టెండర్ నిబంధనల ప్రకారం అద్దెకు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విండో డైరెక్టర్‌లు విజయ్ పటేల్, నాయకులు దిగంబర్, సిద్దు, లక్ష్మణ్, విండో కార్యదర్శి భరత్, తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలో మొక్కలు నాటిన వ్యవసాయ అధికారి

రెంజల్,ఆగస్టు14: ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం రెంజల్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి వాజీద్ హుస్సేన్ మొక్కలు నాటి పంపిణీ చేశారు.

విజయవంతంగా నగర బంద్

పెద్దబజార్, ఆగస్టు 14: బంగ్లాదేశ్‌లో అరాచకాలు హిందువులపై, దేవాలయాలపై దాడులను ఖండిస్తూ ఇందూరు ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన నగర బంద్ విజయవంతమైంది. నగరంలోని విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ బంగ్లాదేశ్ కాకుండా ప్రపంచ వ్యాప్తంగా హిందువులపై అనేక దాడులు జరుగుతున్నా ఈ దేశంలో సెక్యులర్ అని చెప్పుకొనే జాతీయ, ప్రాంతీయ పార్టీలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కేవలం హిందువులను ఓటు బ్యాంక్‌గా వాడుకొని మమత బెనర్జీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం బంగ్లాదేశ్ అక్రమ చొరబాట్లకు కారకులై ఈ దేశాన్ని విచ్ఛిన్నాన్ని కోరుకుంటున్నారని అన్నారు. హిందూ ఆడబిడ్డలపైన, హిందూ దేవాలయాలపైన జరుగుతున్న మారణఖాండకు నిరసనగా ఇందూరు ఐక్యవేదిక బంద్ పిలుపు మేరకు నగరంలో శాంతియుతంగా విద్యాసంస్థలు, వర్తక, వ్యాపార సంఘాల వారు అందరూ స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించారని అన్నారు. పోలీసుల అక్రమ కేసులపై ఎమ్మెల్యే మండిపాటు పోలీసులు ఉదయం నుంచి శాంతియుతంగా జరుగుతున్న బంద్ వాతావరణాన్ని అక్రమ అరెస్టులతో కార్యకర్తలతో ఇబ్బంది పెట్టడంపై మండిపడ్డారు.బేషరత్తుగా వి డుదల చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ హిం దూ సంఘ్ పెద్దలు, పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


సిరికొండలో మూసి ఉంచిన దుకాణాలు

సిరికొండ: బంగ్లాదేశంలో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సిరికొండలో హిందూ సంఘాలు, యువకులు ఇచ్చిన బంద్ కార్యక్రమంలో ప్రశాంతంగా విజయవంతమయ్యింది.ఒక రోజు ముందే వ్యాపార సంస్థల వద్దకు వెళ్లిన బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మండల కేంద్రంలో బంద్ సక్సెస్ అయ్యింది. ఉదయం నుంచి వ్యాపార సంస్థల యజమానులు స్వచ్ఛందంగా బంద్ పెట్టుకున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుకుండా పోలీసులు గస్తీ తిరుగారు. సీఐ బిక్షపతి సిరికొండలో మకాం వేసి బంద్‌ను పర్యవేక్షించారు.బంద్ కార్యక్రమంలో స్థానిక యువకులు సతీష్,గోపి,శ్రీనివాస్,బీజేపీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, డాక్టర్ లింబాద్రి,బాబురావు, అజయ్,మారుతి,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాలలో జిల్లాకు ప్రథమ స్థానం


అవార్డును అందుకుంటున్న డీఆర్డీవో సాయాగౌడ్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 14: శ్రీనిధి రుణాలలో గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో కొనసాగుతోంది. బుధవారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరిగిన శ్రీనిధి 11వ సర్వసభ్య సమావేశంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించిన జిల్లాకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా డీఆర్డీవో సాయాగౌడ్ అవార్డును అందుకున్నారు. రాష్ట్రంలోనే శ్రీనిధి అన్ని కార్యక్రమాల్లో మొదటి స్థానం సాధించిన కమ్మర్‌పల్లి మండల సమైక్యకు అవార్డును మంత్రి చేతుల మీదుగా ఏపీఎం గంగారెడ్డి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లోకేశ్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

డిచ్‌పల్లి,ఆగస్టు 14: ప్రభుత్వ ముప్పై పడకల ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్న నెలలో ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే గర్భిణులు డెలివరీ నమోదు కావడంపై డిచ్‌పల్లి సీహెచ్‌సీ వైద్యులపై జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ముప్పై పడకల ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు.ఆస్పత్రిలో నిర్వహన రికార్డులు ఆయన తనిఖీ చేసి గర్భిణీ స్త్రీల ప్రసవాల రికార్డును చూసి అసహనం వ్యక్తం చేశాడు, స్టాఫ్ నర్సులు విధులు సక్రమంగా నిర్వహించాలని డెలివరీ శాతాం పెంచాలని ఆయన సూచించారు. ప్రభుత్వ వైద్యంపై గ్రామీణ ప్రజల్లో విశ్వాసం పెంచేలా కార్యాచరణ ఉండాలని ఆయన సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందజేయలన్నారు. ఘన్‌పూర్‌లోని గ్రామ పంచాయతీ, విధులను ఎంపీడీవో రవీందర్, కార్యదర్శి రమేశ్‌తో సందర్శించారు. గ్రామంలో పారిశుధ్యం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.ఆయన వెంట జిల్లావైద్యశాఖ అధికారి రాజశ్రీ, డా.అంజన, వైద్య సిబ్బంది సందీప్‌రెడ్డి, రాజశ్రీ, ప్రత్యూష, వైద్య సిబ్బంది అరుణ్ కుమార్, సంధ్యరాణి, సుమలత, శైలజ, అరుంధతి, ఆశా కార్యకర్తలు సరిత, వనిత, లక్ష్మీ, అరుణ, పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన భార్యభర్తలపై కేసు

నవీపేట,ఆగస్టు14: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన భార్యభర్తలపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం నిజామాబాద్ నుంచి మద్దెపల్లికి ఆర్టీసీ బస్సు వెళ్తుండగా నాగేపూర్ స్టేజీ వద్ద బస్సు నిలపడంతో పెద్ద సంఖ్యలో పాఠశాల విద్యార్థులు బస్సులో ఎక్కారని, అప్పటికే బస్సులో ప్రయాణికులు పూర్తిగా నిండి ఉండడంతో వెనుక మరో బస్సు వస్తుందని అందులో రావాలని డ్రైవర్ విద్యార్థులను కోరారు. ఈ సమయంలో ఒక విద్యార్థిని డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగింది. బస్సు మద్దెపల్లి వెళ్లి తిరిగి ఫకీరాబాద్‌కు రాగా అప్పటికే బస్సు కోసం వేచి ఉన్న సంబంధిత విద్యార్థిని తల్లిదండ్రులు బస్సు డ్రైవర్ రెడ్యాపై దాడి చేశారని ఎస్ఐ పేర్కొన్నారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు భార్యభర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


గొట్టుముక్కలలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మాక్లూర్, ఆగస్టు14: రాజకీయాలు, మాతలు, కులాలు చూడకుండా పార్టీలకు అతీతంగా ప్రతీ లబ్ధిదారునికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్నట్టు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. బుధ వారం మండలంలోని మామిడిపల్లి, చిన్నాపూర్, డీకంపల్లి,గొట్టుముక్కల, మెట్టు ముల్లంగి, బోంకన్‌పల్లి, మాక్లూర్, మాదాపూర్, తదితర గ్రామాల్లో 390చెక్కులను లబ్ధిదా రులకు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు.సెప్టెంబర్ నెల నుంచి రేషన్ టకార్డులు,పింఛన్లు దరఖాస్తులు పరిష్కరించడం జరుగుతుందని, ఇళ్లు లేని వారికి రూ.5 లక్షల మంజూరు చేస్తానని ఆయన అన్నారు.ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, వినోద్, ఎంఎస్‌కె. నా యక్,సంతోష్, గంగారెడ్డి,విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బట్టాపూర్‌లో భక్తి శ్రద్ధలతో తీజ్ పండగ

ఏర్గట్ల, ఆగస్టు 14: మండలంలోని బట్టాపూర్ గ్రామంలో బధవారం గిరిజనులు భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగను జరుపుకున్నారు. తొమ్మిది రోజుల పాటు జరుపుకున్న ఈ పండగలో భాగంగా గిరిజనుల ఆరాధ్య దైవాలను కొలచుకుని పెద్దల పట్ల తమ గౌరవాన్ని చూపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని గిరిజనులు పాల్గొన్నారు.

మనల్ని విభజించి పాలించి బానిసలుగా మార్చారు: అర్బన్ ఎమ్మెల్యే


స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, ఆగస్టు 14: మన భారతదేశానికి వచ్చిన బ్రిటిష్ వారు మనల్ని విభజించి పాలించి బానిసలుగా మార్చారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో భారత పాకిస్తాన్ విభజన సమయంలో ప్రజల కష్టాలు, పోరాటాలు, త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఆగస్టు 14న దేశవిభజన భయానక స్మారక దినాన్ని 2021 నుంచి జరుపుకుంటున్నామని అన్నారు. స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ఫ్రీడమ్ ఫైటర్ కుటుంబ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ అఖండ భారతదేశం అంటే పాకిస్తాన్, బంగ్లాదేశ్ ప్రజలంతా ఆనాడు హిందూ, ముస్లింలు అన్నదమ్ములా కలిసి మెలసి ఉండేవారని అనేక సంపద కలిగిన భారతదేశంపైన బ్రిటిష్ వారి కన్ను పడి వ్యాపారాల కోసం మన దేశానికి వచ్చారని అన్నారు. ఆగస్టు 15, 1947 స్వతంత్ర ప్రకటన అఖండ భారతదేశంలో ప్రజలందరూ సంతోషిస్తున్న కొందరు రాజకీయ నాయకులు మహ్మద్ అలీ జిన్నాకు బయపడి మన అఖండ భారతాన్ని మత ప్రాతిపదికన రెండు ముక్కలుగా విడగొట్టారని తెలిపారు. ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలంటూ జిన్నానెహ్రూ,గాంధీలపైన ఒత్తిడి పెంచి విభజన సమయంలో పాకిస్తాన్‌లో ఉన్న హిందువుల గురించి ఆలోచించకుండా తీసుకున్న నిర్ణయానికి పాకిస్తాన్‌లో ఉన్న హిందువులపై జరిగిన మారణహోమానికి కట్టుబట్టల తో లక్షలమంది శరణార్థులుగా తమ ఆస్తులను వదిలి రావాల్సివచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి,జిల్లానాయకులు నారాయణ, లక్ష్మీనారాయణ, నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సీఐల బదిలీలు

ఖిల్లా, ఆగస్టు 14: జిల్లాలో పని చేస్తున్న పలువురు సీఐలు బదిలీ అయ్యారు. వీరిని బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజి చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. వీరిని బదిలీ అయిన స్థానంలో వెంటనే చేరాలని ఆదేశాలు ఇచ్చారు. నిజామాబాద్ వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న డి.విజయ్‌బాబును బోధన్ రూరల్ సర్కిల్ సీఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న కోలనరేష్‌కుమార్‌ను నిజామాబాద్ ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ చేశారు. ట్రాఫిక్ పీఎస్ సీఐగా ఉన్న వెంకటనారాయణను బోధన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు.బోధన్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న నంద వీరయ్యను నిజామాబాద్ సీసీఆర్‌బీ సీఐగా నియమించారు.నిజామాబాద్ సీసీఆర్‌బీలో పనిచేస్తున్న జి.శ్రీనివాస్‌రాజును నిజామాబాద్ టౌన్ సర్కిల్ సీఐగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సీఐ నరహరిని ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్-1 సీఐ ఆర్.అంజయ్యను ఐజి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఐజి కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న బి.రఘుపతిని నిజామాబాద్ టౌన్-1 ఎస్‌హెచ్‌వోగా నియమించారు. నగరం పరిధిలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న సీఐలను బదిలీ కొనసాగించారు. కొత్తవారికి అవకాశాలను ఈ బదిలీల్లో భాగంగా ఇచ్చారు.

బంగ్లాదేశ్ ఘటనపై న్యాయవాదుల విధుల బహిష్కరణ


కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నిజామాబాద్‌లీగల్, ఆగస్టు 14: బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై జరుగుతున్న హత్యలను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఆఫ్ ఫెడరేషన్ బార్ అసోసియేషన్ పిలువు మేరకు బుధవారం నిజామాబాద్ బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించి హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై హత్యలు, దాడులు, ఆస్తులు ధ్వంసం చేయడాన్ని అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. అరాచకాలపై అంతర్జాతీయ మానవ హక్కుల సం ఘాలు, రాజకీయ పార్టీలు స్పందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. రిజర్వేషన్ ఉద్య మంగా ప్రారంభమై మతోన్మాద తీవ్రవాదులు బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని విగాతం కల్పి స్తూ హిందువులపై పథకం ప్రకారం దాడులు చేయడం ఐక్యరాజ్యసమితి భారత ప్రభుత్వం చొరవ తీసుకొని అక్కడి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


డిచ్‌పల్లిలో 'తిరంగా' ర్యాలీ

డిచ్‌పల్లి,ఆగస్టు 14: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డిచ్‌పల్లిలో హర్‌ఘర్ తిరంగ్ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమా నికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేశ్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం నుంచి రైల్వే స్టేషన్ కూడలి వరకు జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వ హించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ మాట్లాడుతూ.. దేశ ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ గడ్డెభూమన్న,బీజేపీ ప్రతినిధు లు శ్యాంరావు, రవిగౌడ్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మ ణ్, గణేశ్,వెంకటరమణ, శ్రీనివాస్ పరుశురాం, బాలయ్య, సుదర్శన్‌రెడ్డి లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జక్రాన్‌పల్లి,ఆగస్టు 14:మండలంలోని అర్గుల్‌లో ఈ మధ్యన మృతి చెందిన రైతు రాజేష్ కుటుంబంతో పాటు మాజీ ఎంపీటీసీ లక్ష్మి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆర్మూర్ నియోజకవర్గం అంకాపూర్‌లోని లాలన ఆశ్రమం పైపుల రాజారెడ్డి కుటుంబాన్ని కూడా ఆయన పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

హైకోర్టు జడ్జి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు


ఉత్తమ అవార్డు అందుకుంటున్న దృశ్యం

ఏర్గట్ల, ఆగస్టు 14: మండలంలోని బట్టాపూర్ గ్రామానికి చెందిన సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులైన జిల్లా డైరెక్టర్ కట్కం శమంత్‌రెడ్డి, ఆర్మూర్ చైర్మన్ నరేష్‌గౌడ్‌లు బుధవారం 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైకోర్టు జడ్జి చంద్రకుమార్,ప్రముఖ సైకాలజిస్ట్ పద్మ కమలాకర్ చేతుల మీదుగా నేషనల్ అచీవర్స్ అవార్డును అందకున్నారు. సంస్థలో చేరిన కొద్ది కాలంలోనే వారు చేసిన సేవలకై ఈ అవార్డు దక్కిందని, ఈఅవార్డు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు శమంత్ రెడ్డి, నరేష్ గౌడ్‌లు తెలిపారు.